సంపుటి :02 సంచిక :92 పేజీలు :04

వెల ₹5

# అక్షర దర్బార్

www.aksharadarbar.com

Voice of the people

శుక్రవారం 23, మే 2025

ఉష్ణోగ్రతలు

కనిష్టం : 26

గరిష్టం : 33

# ఎన్ కౌంటర్

04

## నలుగురు మావోయిస్టుల మృతి



మల్లోజుల వేణుగోపాల్ (ఫైల్)

# మావోయిస్టు పార్టీ చీఫ్ మల్లోజుల లేదా తిరుపతి?

## ఇద్దరూ తెలంగాణకు చెందిన వారే !

- నంబాల మృతి పార్టీకి పెద్దదెబ్బ
- పార్టీది సుమారు ఐదు దశాబ్దాల చరిత్ర
- ఒక సుప్రీం కమాండర్ నేలకొరగడం ఇదే మొదటిసారి
- భద్రతా బలగాల తర్వాతి టార్గెట్ హిడ్మానే..

03

మావోయిస్టు పార్టీ కార్యదర్శి, సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మృతి మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు. సుమారు ఐదు దశాబ్దాల ఉద్యమంలో ఎదురుకాల్పుల్లో పార్టీ కార్యదర్శి స్థాయి నేత మృతిచెందడం పార్టీ చరిత్రలో ఇదే మొదటిసారి. అంతకు ముందు పార్టీ అగ్రనేతలు ఎదురుకాల్పుల్లో మృతిచెందారని మనం విన్నాం కాని.. ఈ స్థాయి నేత నేలకొరగడం ప్రప్రథమం. 2018లో పార్టీ చీఫ్‌గా గణపతి వైదొలిగిన తర్వాత నంబాల ఆ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మరణం తర్వాత ఇప్పుడు పార్టీ చీఫ్ అనే అంశం తెరపైకి వచ్చింది. ప్రధానంగా మల్లోజుల వేణుగోపాలరావు, తిప్పర్తి తిరుపతి పేర్లు వినిపిస్తున్నాయి. మల్లోజుల వేణుగోపాలరావు ఎవరో కాదు. కరీంనగర్ ప్రాంతానికి చెందినవారే. 2011లో పశ్చిమ బెంగాల్ ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ సోదరుడే. అయితే.. తిరుపతి తెలంగాణ ప్రాంతానికి చెందినవారే కాని.. ఇతమిత్థంగా ఆయన స్వస్థలం తెలియరాలేదు. కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా వీరిద్దరిలో ఒకరు మావోయిస్టు పార్టీ బాధ్యతలు తీసుకుంటారని అంచనా వేస్తున్నది. వీరిద్దరూ తెలంగాణకు చెందిన వారే కావడం గమనార్హం. అప్పుడే కాదు.. ఇప్పుడే కాదు.. మావోయిస్టు పార్టీని ఆది నుంచి నడిపించింది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం. 1969- 70 లలో ప్రత్యేక తెలంగాణ, శ్రీకాకుళం వసంత మేఘ ఘర్జన వెల్లువలో నక్సలిజం పుట్టింది. కొండపల్లి సీతారామయ్య విజన్‌లో నక్సలిజం పురుడు పోసుకున్నది. కేజీ కృష్ణమూర్తి (శివ సాగర్) ఆయనకు అత్యంత సన్నిహితుడిగా మెలిగి పార్టీ నిర్మాణంలో భాగస్వామి అయ్యాడు.

- అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి

# రాజకీయ దుమారం

- చర్చనీయాంశమైన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత లేఖ
- మరో వైఎస్ షర్మిల అన్న బండి సంజయ్
- కాంగ్రెస్ లో చేరే అవకాశాలున్నాయన్న రఘునందన్
- లేఖ పెద్ద జోక్ అన్న మంత్రి కోమటిరెడ్డి

03





# కమీషన్ల దందా !

## రోగం వస్తే ఆ దళారులకు పండుగే

రోగం వచ్చిందంటే ఆ దళారులకు పండగే అవుతుంది. రోగ తీరును బట్టి సదరు దళారులు ఆయా కార్పొరేట్ ఆసుపత్రుల వద్ద బేరం మాట్లాడుకుని రోగులను పంపిస్తున్నట్లు తెలిసింది. రోగి చావు బతుకుల్లో ఉన్న సమయంలో డబ్బులకు ఇబ్బందులు పడుతున్నా వారు అవేమీ చూడడం లేదు. ముఖ్యంగా కొందరు వైద్యులు, ఆర్ఎంపీలు, అంబులెన్స్ యజమానులు దళారుల అవతారం ఎత్తుతున్నారనే టాక్ ఉంది. పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రిలో ఆ రోగులకు అయిన మెడికల్ బిల్లులో 20 నుంచి 30 శాతం కమీషన్లు దళారులకు లభిస్తున్నాయని తెలిసింది. ఇదే అదనుగా చేసుకుని పలువురు మెడికల్ దందా సాగిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. -అక్షరదర్బార్, నర్సంపేట

- కొందరు వైద్యులు, ఆర్ఎంపీలు, అంబులెన్స్ యజమానులు బ్రోకర్ అవతారం
- రోగులకు నచ్చజెప్పి పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు తరలింపు
- 20 నుంచి 30 శాతం కమీషన్లు పొందుతున్న వైనం
- రోగుల కోసం దళారులకు పెద్ద ఆస్పత్రుల ఆఫర్లు

02



# ఝాన్సీ రెడ్డికి హైకోర్టు షోకాజ్ నోటీసులు

- 2017లో 75 ఎకరాల భూమి కొనుగోలు
- విదేశీ పౌరసత్వంతో వ్యవసాయ భూమి కొన్నారని ఆరోపణ
- నిబంధనలు ఉల్లంఘించారని కోర్టులో పిటిషన్
- జూన్ 19లోగా వివరణ ఇవ్వాలని హైకోర్టు ఆదేశం

03

# 2న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి
- నాలుగేళ్లలో దాదాపు 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామని స్పష్టం

02



# ప్రజల చెంతకు రెడ్ క్రాస్ సేవలు

బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి భూమిపూజ

భవన నిర్మాణానికి రూ. 1.5 కోట్ల నిధులు.



అక్షర దర్బార్, పరకాల : హనుమకొండ జిల్లా పరకాల నియోజకవర్గ కేంద్రంలో రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నిర్మించనున్న బ్లడ్ స్టోరేజ్ సెంటర్ నూతన భవనానికి శుక్రవారం రోజు భూమిపూజ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో వరంగల్ పార్లమెంటు సభ్యురాలు డాక్టర్ కడియం కావ్య, పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్ రెడ్డి, జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు పి. ప్రావీణ్య, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా. పి. విజయచందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు పాలకవర్గ సభ్యులు సంయుక్తంగా శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో హనుమకొండ జిల్లా కలెక్టర్, రెడ్ క్రాస్ జిల్లా అధ్యక్షురాలు పి. ప్రావీణ్య, రెడ్ క్రాస్ జిల్లా చైర్మన్ డా. పి. విజయ చందర్ రెడ్డి, రాష్ట్ర పాలకవర్గ సభ్యులు ఈ.వి. శ్రీనివాస్ రావు, బొమ్మినేని పాపిరెడ్డి (ట్రెజరర్), సభ్యులు పుల్లూరు వేణుగోపాల్, డా. మాగంటి శేషమాధవ్, డా. సంధ్యారాణి, బిళ్ళ రమణారెడ్డి, శాశ్వత సభ్యులు, సిబ్బంది, ప్రభుత్వ అధికారులు, పోలీసు అధికారులు, మున్సిపల్ ప్రతినిధులు, ఇతర పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# మరో 4 రోజుల పాటు వర్షాలు



అక్షరదర్బార్, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రంలోని కొన్ని జిల్లాల్లో మరో నాలుగు రోజుల పాటు తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు, మరికొన్ని జిల్లాల్లో ఉరుములు, ఈదురు గాలులతో వానలు కురిసే అవకాశం ఉన్నట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం గురువారం వెల్లడించింది. వచ్చే మూడు రోజులు గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే 3 నుంచి 5 డిగ్రీలు తక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని ప్రకటించింది. మరో రెండు రోజుల్లో కేరళ రాష్ట్రంలో నైరుతి రుతుపవనాలు ప్రవేశించేందుకు అనుకూల పరిస్థితులు ఉన్నట్లు పేర్కొంది. మే నెల 27 నాటికి పశ్చిమ మధ్య, ఉత్తర బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. దీని ప్రభావంతో గంటకు 40 నుంచి 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. గురువారం తూర్పు మధ్య అరేబియా సముద్రం, దక్షిణ కోంకణ్ గోవా తీర ప్రాంతం సమీపంలో ఏర్పడిన అల్పపీడన ప్రాంతం మరింత బలపడింది. ఇది రాగల 24 గంటలలో ఉత్తర దిక్కుగా కదలి వాయుగుండంగా బలపడే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ వెల్లడించింది. ఈ నెల 27న పశ్చిమ మధ్య సమీపంలోని ఉత్తర బంగాళాఖాతంలో మరో అల్పపీడనం ఏర్పడే అవకాశం ఉందని వెల్లడించింది.



# కమీషన్ల దందా

## రోగం వస్తే ఆ దళారులకు పండుగే

- కొందరు వైద్యులు, ఆర్ఎంపీలు, అంబులెన్స్ యజమానులు బ్రోకర్ అవతారం
- రోగులకు నచ్చజెప్పి పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రులకు తరలింపు
- 20 నుంచి 30 శాతం కమీషన్లు పొందుతున్న వైనం
- రోగుల కోసం దళారులకు పెద్ద ఆస్పత్రుల ఆఫర్లు



అక్షరదర్బార్, నర్సంపేట: రోగం వచ్చిందంటే ఆ దళారులకు పండగే అవుతుంది. రోగ తీరును బట్టి సదరు దళారులు ఆయా కార్పొరేట్ ఆసుపత్రుల వద్ద బేరం మాట్లాడుకుని రోగులను పంపిస్తున్నట్లు తెలిసింది. రోగి చావు బతుకుల్లో ఉన్న సమయంలో డబ్బులకు ఇబ్బందులు పడుతున్నా వారు అవేమీ చూడడం లేదు. ముఖ్యంగా కొందరు వైద్యులు, ఆర్ఎంపీలు, అంబులెన్స్ యజమానులు దళారుల అవతారం ఎత్తుతున్నారనే టాక్ ఉంది. పట్టణాల్లోని కార్పొరేట్ ఆసుపత్రిలో ఆ రోగులకు అయిన మెడికల్ బిల్లులో 20 నుంచి 30 శాతం కమీషన్లు దళారులకు లభిస్తున్నాయని తెలిసింది. ఇదే అదనుగా చేసుకుని పలువురు మెడికల్ దందా సాగిస్తున్నారు. ఇంత తతంగం జరుగుతున్నప్పటికీ అధికారులు చూసి చూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలున్నాయి. దీనిపై పూర్తి విచారణ చేసి చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

**రోగి మీదే కమీషన్ల భారం**

పెద్ద జబ్బుల బారిన పడిన రోగులు అత్యవసర పరిస్థితుల్లో స్థానిక వైద్యులు పట్టణ ఆసుపత్రులకు రెఫర్ చేస్తున్నారు. దీనిని మధ్య దళారులు ఆసరాగా చేసుకుని డబ్బు పోగేసుకుంటున్నారు. రోగం తీవ్రత ఉంటేనే రోగులను కార్పొరేట్ ఆసుపత్రులకు పంపిస్తుంమటారు. చాలామంది రోగులు ఏ ఆసుపత్రికి వెళితే ఏ చికిత్స లభిస్తుందో తెలియని పరిస్థితుల్లో ఉంటారు. మరికొందరు రోగులకు ఏ ఆసుపత్రికి వెళ్లాలో తెలిసినప్పటికీ దళారీలు పరేషాన్ కు గురిచేసి, వారిని మభ్యపెట్టి తాము అనుకున్న ఆసుపత్రికి తరలించేస్తున్నారనే ఆరోపణలున్నాయి. దళారులకు కార్పొరేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ఇచ్చే కమిషన్లు కూడా రోగులు చెల్లించిన బిల్లుల నుంచే కట్ చేసి చెల్లిస్తున్నారు. ఉదాహరణకు రూ.లక్ష బిల్లును ఒక రోగి కార్పొరేటర్ ఆస్పత్రికి చెల్లిస్తే అందులో నుంచి కమీషన్ రూ.20 వేలకుపైనే ఆ దళారులకు వెంటనే లభిస్తుంది. రోగికైన బిల్లులో తగ్గించమని ఎంత ప్రాధేయపడినప్పటికీ కార్పొరేట్ ఆసుపత్రులు మినహాయింపులు ఇవ్వడం లేదు. కానీ పర్సంటేజీలు మాత్రం ఠంచనుగా చెల్లిస్తున్నారు.

**- దళారులకు కార్పొరేట్ ప్రోత్సాహం**

దళారులకు కార్పొరేట్ వైద్యశాలల యాజమానులు ప్రోత్సాహం అందిస్తున్నారు. తమ ఆసుపత్రికి రోగులను తీసుకురావాలని దళారులకు ఆఫర్లు ఇస్తున్నారు. పోటీలో మరికొందరు ఎక్కువ పర్సంటేజీలు ఇస్తున్నారు. దీనికి ఆకర్షితులు అవుతున్న దళారులు ఆయా ఆసుపత్రులకే రోగులను పంపిస్తున్నారు. దళారులు రోగులను పంపిస్తేనే కొన్ని ఆసుపత్రులు రోగులతో కళకళలాడే పరిస్థితి ఉంది. దళారులు రోగులను పంపకుంటే పలు ఆస్పత్రుల్లో రోగుల సంఖ్య గణనీయంగా తగ్గిపోయే అవకాశం ఉంది. దీంతో ఆసుపత్రులు ఉద్యోగులను నియమించుకొని దళారీల ద్వారా రోగులను రప్పించుకునే పరిస్థితి కొనసాగుతుంది. రోగులను పంపిస్తున్నామని దళారులు ముందుగానే సమాచారం చేరవేస్తున్నారు. కొందరు వైద్యులు ఒక కార్పొరేట్ ఆసుపత్రికి వెళ్లండని రెఫర్ కాగితం అందిస్తుండగా దానిని కాదని అంబులెన్స్ డ్రైవర్లు రోగి బంధువులకు నచ్చజెప్పి మరో కార్పొరేట్ ఆసుపత్రులకు పంపిస్తూ కమీషన్లు పొందుతున్నారు. తమ పేషంట్ ను మీ ఆసుపత్రికి పంపించామని స్థానిక వైద్యులు ఆయా కార్పొరేట్ ఆసుపత్రికి కాల్ చేయగా అలాంటి పేషెంట్ తమ దగ్గరికి రాలేదనే సమాధానం వస్తుంది. అంటే మధ్యలోనే అంబులెన్స్ డ్రైవర్లు మరో ఆసుపత్రికి చేరవేసి వైద్యులను, ఆర్ఎంపీలను, బోల్తా కొట్టిస్తున్నారు. ఇలాంటి పరిస్థితులు నర్సంపేట పట్టణంలో జరుగుతున్నాయని సమాచారం. నర్సంపేట నుంచి చాలా అంబులెన్స్ లు వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ పట్టణాలకు కార్పొరేట్ ఆసుపత్రులకు తరలి వెళ్తున్నాయి. ఈ క్రమంలో వైద్యులు, ఆర్ఎంపీలు అంబులెన్స్ డ్రైవర్లతో గొడవలు అవుతు న్నాయి. దళారులు ఒకరి కంటే మరొకరు కమీషన్ల కోసం ఎత్తుకు పైఎత్తులు వేస్తూ కమీషన్లు పొందుతున్నారు.

**సొంత నిర్ణయం తీసుకుంటేనే మేలు...**

రోగులు అత్యవసర పరిస్థితుల్లో వరంగల్, హనుమకొండ, హైదరాబాద్ లాంటి కార్పొరేట్ ఆసుపత్రిలో చేరి చికిత్సలు చేయించుకునేందుకు వెళ్లేముందు రోగులు తగు జాగ్రత్తలు తీసుకుంటే మంచిదనే అంటున్నారు. వైద్యులు, ఆర్ఎంపీలు, అంబులెన్స్ డ్రైవర్లకు ఏమాత్రం కూడా సమాచారం ఇవ్వకుండా వెళితేనే ఎక్కువ భారం పడకుండా ఉంటుందని అంటున్నారు. ఇటీవల నర్సంపేట నుంచి వరంగల్ లోని ఓ కార్పొరేట్ ఆసుపత్రికి రోగి వెళ్లి చికిత్స చేయించు కున్నారు. ఆ రోగి బంధువులు రూ.5 లక్షల బిల్లు చెల్లించారు. ఈ విషయం నర్సంపేటలో మొదట చికిత్స పొందిన ఆసుపత్రికి తెలిసి తామే పంపించామని కమీషన్ కూడా తీసుకున్నారు. తాము సొంతంగా ఆసుపత్రికి వస్తే ఎలా కమిషన్లు వాళ్లకు ఇస్తారని బంధువులు ఆసుపత్రిలో గొడవ పడటం జరిగింది. ఇలాంటివి కోకొల్లలుగా జరుగుతున్నాయి. అయినప్పటికీ కూడా ఉన్నతాధికారులు ఈ కమిషన్లపై దృష్టి సారించడం లేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇప్పటికైనా కమిషన్లు ఇస్తున్న ఆసుపత్రులపై కఠిన చర్యలు తీసుకోవలసిన అవసరం ఉంది.

# 2న ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు

- గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి వెల్లడి
- నాలుగేళ్లలో దాదాపు 20 లక్షల ఇళ్లు నిర్మిస్తామని స్పష్టం

అక్షరదర్బార్, ఖమ్మం: రాష్ట్ర వ్యాప్తంగా జూన్ 2న సుమారు వెయ్యి ఇందిరమ్మ ఇళ్ల గృహ ప్రవేశాలు ఉంటాయని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. ఖమ్మం జిల్లాలోని కారేపల్లి మండలం చిమ్నాతండా, కారేపల్లిలో వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్ నాయక్‌తో కలిసి మంత్రి పర్యటించారు. ఈ సందర్భంగా పొంగులేటి మాట్లాడుతూ పేదోళ్ల చిరకాల కోరిక ఇందిరమ్మ ఇళ్లు అని, రాబోయే నాలుగేళ్లలో దాదాపు 20 లక్షల ఇళ్లు నిర్మించే విధంగా చర్యలు చేపడతామన్నారు. అన్నదాతలు ధరణితో అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని, వాటిని తొలగించడానికి భూభారతి చట్టం తెచ్చినట్లు మంత్రి పేర్కొన్నారు. రైతులకు ఎటువంటి నష్టం జరగకుండా తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొంటుందని వివరించారు.

**నక్షా గ్రామాల్లో రీసర్వే**

రాష్ట్రంలో నిజాం కాలం నుంచి సర్వే జరగని, ఇప్పటివరకు సర్వే రికార్డుల్లేని 413 నక్షా గ్రామాల్లో రీసర్వే చేపడుతున్నట్లు మంత్రి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ప్రయోగాత్మకంగా నూగురు (ములుగు), షాహిద్‌నగర్ (సంగారెడ్డి), సలార్‌నగర్ (మహబూబ్‌నగర్), కొమ్మనాపల్లి (జగిత్యాల), ములుగుమడ (ఖమ్మం) గ్రామాలను ఎంపిక చేశామన్నారు. నక్షాలేని గ్రామాలు, అధీకృత సర్వేయర్ల ట్రైనింగ్ పై అధికారులతో గురువారం సమీక్షా సమావేశం నిర్వహించారు. సర్వేయర్లకు ఈ నెల 26 నుంచి సంబంధిత జిల్లా కేంద్రాల్లో 2 నెలల శిక్షణ ఇస్తామని చెప్పారు.



## జీహెచ్ఎంసీలో

# అవినీతి తిమింగలం

- రూ.8 లక్షలు లంచం డిమాండ్
- రూ.4 లక్షలు స్వీకరణ
- అసిస్టెంట్ సిటీ ప్లానర్ అరెస్ట్

అక్షరదర్బార్, హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో సికింద్రాబాద్ జోన్ లోని జీహెచ్ఎంసీ జోనల్ ఆఫీస్ లో శుక్రవారం అవినీతి నిరోధక శాఖ (ఏసీబీ) అధికారులు సోదాలు జరిపారు. ఈ ఆఫీసులోని అసిస్టెంట్ సిటీ ప్లానర్ బి విట్టల్ రావును అరెస్టు చేశారు. అపార్ట్ మెంట్ లకు సంబంధించిన రెండు ఆక్యుపేన్సి దరఖాస్తులను ప్రాసెస్ చేయడానికి అసిస్టెంట్ సిటీ ప్లానర్ విట్టల్ రావు రూ.8 లక్షలు లంచం డిమాండ్ చేశారు. ఇందులో భాగంగా దరఖాస్తుదారు నుంచి ఆయన రూ.4 లక్షలు స్వీకరించారు. ప్రక్రియను పూర్తి చేయడానికి మిగతా రూ.4 లక్షలు ఇవ్వాలని విట్టల్ రావు డిమాండ్ చేస్తున్నారు. ఈ నేపథ్యంలో



బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించారు. దీంతో తన ప్రజా విధిని అనుచితంగా, నిజాయితీ లేకుండా నిర్వర్తించారని అసిస్టెంట్ సిటీ ప్లానర్ బి విట్టల్ రావును ఏసీబీ అధికారులు అరెస్టు చేసి కోర్టులో హాజరుపరుస్తున్నట్లు వెల్లడించారు.

# కేంద్ర సాయం తీసుకుంటాం

**పస్తాపూర్ సభలో సీఎం రేవంత్ రెడ్డి**

అక్షరదర్బార్, జహీరాబాద్: రాష్ట్రాన్ని అభివృద్ధి చేసేందుకు కేంద్ర సాయం తీసుకుంటామని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పని చేస్తేనే అభివృద్ధి సాధించగలమని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. సంగారెడ్డి జిల్లా జహీరాబాద్‌లో శుక్రవారం ఆయన పర్యటించారు. మెదక్ అంటే ఇందిరమ్మ, ఇందిరమ్మ అంటే మెదక్ అని, ఇక్కడి ప్రజలను కాంగ్రెస్ ఎప్పుడూ గుర్తుపెట్టుకుంటుందని సీఎం అన్నారు. జిల్లాలోని పస్తాపూర్‌లో నిర్వహించిన బహిరంగ సభలో రేవంత్ రెడ్డి మాట్లాడారు. జహీరాబాద్ నిమ్జ్ కోసం భూములు కోల్పోయిన 5,612 కుటుంబాలకు ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని సీఎం ప్రకటించారు. గేట్ వే ఆఫ్ ఇండస్ట్రీస్‌గా జహీరాబాద్ నిలవాలని కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఈ ప్రాంతానికి అవసరమైన నిధులు మంజూరు చేస్తామని, నారాయణ్‌ఖేడ్ అభివృద్ధికి ప్రత్యేక సమీక్ష నిర్వహించి అవసరమైన నిధులు కేటాయిస్తామని హామీ ఇచ్చారు. పటాన్‌చెరు ప్రాంతం మినీ ఇండియావంటిదని, ఈ ప్రాంతంలో ఇందిరమ్మ ప్రధానిగా ఉన్నప్పుడే అభివృద్ధి జరిగిందని ముఖ్యమంత్రి అన్నారు. సింగూరు ప్రాజెక్టును ఎకో టూరిజం కింద తీర్చిదిద్దుతామని, తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం రాగానే రైతులకు రుణమాఫీ చేయడంతో పాటు రైతు భరోసా అమలు చేశామని తెలిపారు. ఐదు సంవత్సరాలలోపు కోటి మంది మహిళలను కోటీశ్వరులుగా మారుస్తామని, అదానీ, అంబానీలతో పోటీపడి వ్యాపారం చేసేలా మహిళలను ప్రోత్సహిస్తున్నామని చెప్పారు.

## పుణ్య స్నానమాచరించిన ఎమ్మెల్యే దొంతి



నర్సంపేట, అక్షర దర్బార్ : దక్షిణ భారతదేశ త్రివేణి సంగమంగా పేరొందిన కాళేశ్వరం పవిత్ర సరస్వతీ పుష్కరాల్లో శుక్రవారం నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి కుటుంబ సమేతంగా పాల్గొని పుణ్య స్నానమాచరించారు. నదీ తీరాన దీపారాధన చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం శ్రీ కాళేశ్వర ముక్తేశ్వర స్వామి వారికి పూజలు నిర్వహించారు. దేవాలయ అధికారులు, అర్చకులు ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి తీర్థ ప్రసాదాలు అందించారు. సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ చంపేట నియోజవర్గం ప్రజలందరూ పాడి, పిల్లాపాపలతో, సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని పుష్కరాలలో సరస్వతి మాతను వేడుకున్నట్లు మన తెలిపారు.

### ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా

## గుండెకారి రంగారావు



దుగ్గొండి, అక్షర దర్బార్, ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడిగా గుండెకారి రంగారావు ఎంపికయ్యారు. సిద్దిపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి సంక్షేమ సంఘం సమావేశంలో రంగారావును నియమించారు. ఈ సందర్భంగా రంగారావు మాట్లాడుతూ కార్యకుల సంక్షేమ సంఘం అభివృద్ధికి తన శక్తి వంచన లేకుండా కృషిచేస్తానన్నారు. రాష్ట్ర ,జిల్లా ఆరెకుల ముఖ్య నాయకుల సలహా సూచన మేరకు పని చేస్తానన్నారు. తన నియామకానికి సహకరించిన ఆరె కుల సంక్షేమ సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నాగుర్ల వెంకటేశ్వర్లుకి, రాష్ట్ర అధ్యక్షుడు చెట్టుపల్లి శివాజీకి, రాష్ట్ర కన్వీనర్ జెండా రాజేష్ కి, స్టీరింగ్ కమిటీ చైర్మన్ దిగంబర రావుకి, రైతు విభాగం రాష్ట్ర అధ్యక్షుడు మోర్తాల చందర్ రావుకి,క్రమశిక్షణ కమిటీ రాష్ట్ర అధ్యక్షులు మారుజోడు రాంబాబుకి, రాష్ట్ర, జిల్లా కమిటీ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు.



# మావోయిస్టు పార్టీ చీఫ్ మల్లోజుల లేదా తిరుపతి?

## ఇద్దరూ తెలంగాణకు చెందిన వారే !





- నంబాల మృతి పార్టీకి పెద్దదెబ్బ
- పార్టీది సుమారు ఐదు దశాబ్దాల చరిత్ర
- ఒక సుప్రీం కమాండర్ నేలకొరగడం ఇదే మొదటిసారి
- భద్రతా బలగాల తర్వాతి టార్గెట్ హిడ్మానే..

అక్షరదర్బార్, ప్రధాన ప్రతినిధి: మావోయిస్టు పార్టీ కార్యదర్శి, సుప్రీం కమాండర్ నంబాల కేశవరావు మృతి మావోయిస్టు పార్టీకి పెద్ద దెబ్బ అని చెప్పవచ్చు. సుమారు ఐదు దశాబ్దాల ఉద్యమంలో ఎదురుకాల్పుల్లో పార్టీ కార్యదర్శి స్థాయి నేత మృతిచెందడం పార్టీ చరిత్రలో ఇదే మొదటిసారి. అంతకు ముందు పార్టీ అగ్రనేతలు ఎదురుకాల్పుల్లో మృతిచెందారని మనం విన్నాం కాని.. ఈ స్థాయి నేత నేలకొరగడం ప్రప్రథమం. 2018లో పార్టీ చీఫ్‌గా గణపతి వైదొలిగిన తర్వాత నంబాల ఆ బాధ్యతలు తీసుకున్నారు. ఆయన మరణం తర్వాత ఇప్పుడు పార్టీ చీఫ్ అనే అంశం తెరపైకి వచ్చింది. ప్రధానంగా మల్లోజుల వేణుగోపాలరావు, తిప్పర్తి తిరుపతి పేర్లు వినిపిస్తున్నాయి. మల్లోజుల వేణుగోపాలరావు ఎవరో కాదు. కరీంనగర్ ప్రాంతానికి చెందినవారే. 2011లో పశ్చిమ బెంగాల్ ఎదురుకాల్పుల్లో మృతిచెందిన మల్లోజుల కోటేశ్వరరావు అలియాస్ కిషన్‌జీ సోదరుడే. అయితే.. తిరుపతి తెలంగాణ ప్రాంతానికి చెందినవారే కాని.. ఇతమిత్థంగా ఆయన స్వస్థలం తెలియరాలేదు. కేంద్ర ఇంటెలిజెన్స్ వర్గాలు కూడా వీరిద్దరిలో ఒకరు మావోయిస్టు పార్టీ బాధ్యతలు తీసుకుంటారని అంచనా వేస్తున్నది. వీరిద్దరూ తెలంగాణకు చెందిన వారే కావడం గమనార్హం. అప్పుడే కాదు.. ఇప్పుడే కాదు.. మావోయిస్టు పార్టీని ఆది నుంచి నడిపించింది తెలంగాణ ప్రాంతానికి చెందిన వారే కావడం విశేషం. 1969- 70 లలో ప్రత్యేక తెలంగాణ, శ్రీకాకుళం వసంత మేఘ ఘర్జన వెల్లువలో నక్సలిజం పుట్టింది. కొండపల్లి సీతారామయ్య విజన్‌లో నక్సలిజం పురుడు పోసుకున్నది. కేజీ కృష్ణమూర్తి (శివసాగర్) ఆయనకు అత్యంత సన్నిహితుడిగా మెలిగి పార్టీ నిర్మాణంలో భాగస్వామి అయ్యాడు.

### జగిత్యాల జైత్రయాత్రతో మొదలు..

నంబాల కేశవరావు పుట్టింది శ్రీకాకుళం జిల్లా అయినప్పటికీ, ఆయన ఇంజినీరింగ్‌చదువుకున్నది వరంగల్‌లోని అప్పటి ఆర్ఈసీ అనబడే రీజినల్ ఇంజినీరింగ్ కాలేజీ.. అదే ఇప్పటి నిట్ అనబడే నేషనల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఇంజినీరింగ్. నాడు పీపుల్స్‌వార్ ఉద్యమం ఆయన్ను ఎంతగానో ఆకర్షించింది. వామపక్ష ఉద్యమాలకు పెట్టింది పేరైన వరంగల్ ఆయన్ను ఎంతగానో ప్రభావితం చేసింది. ఆ వెల్లువతోనే ఆయన రాడికల్ స్టూడెంట్ యూనియన్(ఆర్ఎస్‌యూ)లో సభ్యుడిగా చేరాడు. అనేక విద్యార్థి ఉద్యమాల్లో పాల్గొన్నాడు. 1969లో పశ్చిమ బెంగాల్‌లో చారు మజుందార్ అలియాస్ చారు బాబు నేతృత్వంలో నక్సల్బరీ ఉద్యమం మొదలైన క్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లోనూ ప్రత్యేక తెలంగాణ ఉద్యమం మొదలైంది. తర్వాత శ్రీకాకుళం వసంత మేఘ గర్జన షురూ అయింది. ప్రజాస్వామ్యం ద్వారా కాదు తుపాకీ గొట్టం ద్వారానే విప్లవం వస్తుందని అని నమ్మిన కొండపల్లి సీతారామయ్య పీపుల్స్‌వార్‌కు నాంది పలికారు. ఆయనకు అత్యంత సన్నిహితుడిగా ఉన్న కేజీ కృష్ణమూర్తి అలియాస్ శివసాగర్ పార్టీ నిర్మాణానికి బాటలు వేశారు. యుద్ధరీతిలో వీరు గెరిల్లాపోరాటాన్ని ఎంచుకున్నారు. అందుకు కారణం క్యూబాలో ఫిడెల్ క్యాస్ట్రో, చే గువేరా గెరిల్లా పోరాటం చేసి విప్లవం సాధించారు. క్యూబాను సామ్రాజ్యవాద సంకెళ్ల నుంచి విడిపించారు. ఇదే స్ఫూర్తితో సీతారామయ్య గెరిల్లా యుద్ధరీతిని ఎంచుకున్నారు. ఆయన పిలుపుతో వందలాది మంది విద్యావంతులు నాడు పీపుల్స్ వార్ లో చేరారు.

### పీపుల్స్‌వార్.. మావోయిస్టు పార్టీగా..

కారణాలమైనప్పటికీ.. పీపుల్స్ వార్ పార్టీ అనేక వైఫల్యాలను చవిచూసింది. చేదు అనుభావాలను దిగమింగింది. అయితే.. అప్పటికే పరిస్థితి చేయిదాటిపోయింది. అప్పటికే పార్టీలో కీలక నేతగా పేరున్న గణపతి నేతృత్వంలో పీపుల్స్ వార్ కాస్త మావోయిస్టు పార్టీగా అవతరించింది. తొలుత తెలంగాణ ప్రాంతంలోని గోదావరి లోయలో ప్రారంభమైన ఉద్యమం ఖమ్మం, మెదక్, వరంగల్, ఆదిలాబాద్ జిల్లాలకు వెళ్లింది. తర్వాత అనేక రాష్ట్రాలకు పాకింది. ఉమ్మడి ఏపీలోని శ్రీకాకుళం, విశాఖపట్నం జిల్లాలకూ, ఒడిశాలోని ఆంధ్రా ఒడిశా సరిహద్దు ప్రాంతం (ఏఓబీ), ఛత్తీస్‌గఢ్ వరకు పార్టీ విస్తరణ జరిగింది. బీహార్, ఝార్ఖండ్, పశ్చిమ బెంగాల్ వరకు తన ప్రాబల్యాన్ని చూపింది. అయితే.. ఆదివాసీల్లో పార్టీకి ఎంతో మద్దతు ఉంది. లేకుండా.. ఇన్ని దశాబ్దాల పాటు పార్టీ మనుగడ సాధ్యమయ్యేది కాదు. కేంద్రంలో కాని, రాష్ట్రంలో కాని.. ఏ పార్టీ అధికారంలో ఉన్నా.. మావోయిస్టుల ఏరివేతే లక్ష్యంగా పెట్టకున్నదనేది వాస్తవం. పార్టీని అణచివేసేందుకు సామ, దాన, భేద, దండోపాయాలే కాదు.. అసలు మావోయిస్టు నేతల హత్యలనే ప్రోత్సహించిన సందర్భాలు అనేకం ఉన్నాయి.

### - స్వయంకృతాపరధామూ..

మావోయిస్టు పార్టీని ఆదివాసీలు ఆదరించారనేది వాస్తవం. అయితే.. ఇన్‌ఫార్మర్ల నెపంతో వారినే హతమార్చడం పార్టీకి చెడ్డపేరు తీసుకువచ్చింది. ఏ ఆదివాసీల కోసమైతే పార్టీ జన తన సర్కార్ ఏర్పాటు చేసి, వారి బాగోగుల కోసం పాటుపడిందో... అదే పార్టీ అమాయకులను ఆదివాసీలను హతమార్చటం కొంత పార్టీకి మైనస్ అయింది. అలాగే.. రాజ్యం కూడా తక్కువేమీ కాదు.. మావోయిస్టులను మట్టుపెట్టేందుకు ప్రైవేటు సైన్యాలను ప్రోత్సహించిందనే ఆరోపణలు ఉన్నాయి. అలా పుట్టుకొచ్చిందే.. ఛత్తీస్‌గఢ్ దండకారణ్యంలో సల్వాజుడుం. దీని గ్రూప్‌లోని సభ్యులు ఎంతో మంది మావోయిస్టులను హతమార్చారు. బదులుగా మావోయిస్టులు కూడా సల్వాజుడుంను ఉపేక్షించలేదు. మావోయిస్టులు కూడా సల్వాజుడంపై ప్రతికార దాడులు చేశారు. ఆ ప్రతీకార చర్యల్లోనే సల్వాజుడుం చీఫ్ మహేంద్రకర్మ దుర్మరణం పాలయ్యాడు. తెలంగాణ ప్రాంతంలో రాజ్యమే నయీమ్ లాంటి నరరూప రాక్షసుడిని మావోయిస్టులను మట్టుపెట్టేందుకు వదిలిందనే కథనాలు ఇప్పటికీ ఈ తెలంగాణ సమాజంలో ప్రచారంలో ఉన్నాయి. ఏదేమైనప్పటికీ మావోయిస్టు పార్టీ ప్రస్తుతానికి గడ్డు పరిస్థితుల్లో ఉందనేది వాస్తవం. మరోవైపు కేంద్ర ప్రభుత్వం వచ్చే ఏడాది మార్చి నాటికి అసలు భారతదేశంలో మావోయిస్టులనే వారుండరని, మావోయిస్టు పార్టీని నామరూపాల్లేకుండా చేస్తామని కంకణం కట్టుకుని యుద్ధం ప్రారంభించింది. ఈ ఏడాది 'ఆపరేషన్ కగార్' పేరుతో చేపట్టిన కూంబింగ్ కారణంగా ఇప్పటివరకు 100 మంది మావోయిస్టులు నేలకొరిగారు. భద్రతా బలగాల తర్వాతి టార్గెట్ మావోయిస్టు పార్టీ మాస్టర్ మైండ్ హిడ్మానే అంటున్నారు. హిడ్మా కోసం వేట కొనసాగుతూనే ఉంది.

## కొప్పుల కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏరుకొండ శంకర్

అక్షర దర్బార్, శాయంపేట : శాయంపేట మండలంలోని కొప్పులలో కాంగ్రెస్ గ్రామ శాఖ అధ్యక్షుడిగా ఏరుకొండ శంకర్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. శుక్రవారం గ్రామ ఇంచార్జులు చల్లా చక్రపాణి, పోతు కృష్ణమూర్తి ల ఆధ్వర్యంలో గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడు ఏరుకొండ శంకర్, ప్రధాన కార్యదర్శులు చాడ రాంరెడ్డి, పిట్టల నరేష్, ఉపాధ్యక్షుడు మామిడి రవి, సహాయ కార్యదర్శి గుండా ప్రవీణ్, కోశాధికారి అలువాల భాస్కర్, కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా శంకర్ మాట్లాడుతూ.. తన ఎన్నికకు సహకరించిన అందరికీ కృత్జతలు తెలిపారు. పార్టీని మరింత బలోపేతం చేస్తానన్నారు. అలాగే గ్రామ అనుబంధ కమిటీ ఎస్సీ, బీసీ, మైనార్టీ, మహిళా విభాగం కమిటీలు వేశారు. ఈ కార్యక్రమంలో కల్లెపు వంశీ, వంగాల తిరుపతి రెడ్డి, వేములపల్లి రవీందర్, సురేష్, కొమురయ్య, శానబోయిన ఆగయ్య, గండి రాజు తదితరులు పాల్గొన్నారు.



## సైనిక్ స్కూల్ లో శారద స్కూల్ విద్యార్థుల ఎంపిక

అక్షర దర్బార్, పరకాల : ఎప్రిల్ లో 2025 లో నిర్వహించిన ఆల్ ఇండియా సైనిక్ స్కూళ్ల ఎంట్రన్స్ లో "శారదా విద్యాలయం "హైస్కూల్ విద్యార్థులు మునిగాల అభినవ్ (6వ తరగతిక) బాలవేని శ్రీ చరణ్ (9వ తరగతి)లు క్యాలిఫైడ్ అయినట్లు పాఠశాల ప్రిన్సిపాల్ మార్క సత్య్రనారాయణ తెలిపారు. ప్రిన్సిపాల్ మాట్లాడుతూ కృషి, పట్టుదలతో కష్టపడి చదివితే అనుకున్న లక్ష్యాలను సాధించవచ్చునని విద్యార్థులు నిరూపించారని పేర్కొన్నారు. విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు అభినందించారు.





## కాంగ్రెస్ పార్టీ గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

### కాంగ్రెస్ మండల అధ్యక్షుడు బుచ్చిరెడ్డి

అక్షర దర్బార్, శాయంపేట : రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులు గెలిచేలా ప్రతి కార్యకర్త పనిచేయాలని కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు దూదిపాల బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని కాట్రపల్లి గ్రామంలో నూతనంగా కాంగ్రెస్ గ్రామ కమిటీలను ఎంపిక చేశారు. ఈ సందర్భంగా బుచ్చిరెడ్డి మాట్లాడుతూ ప్రతి కాంగ్రెస్ కార్యకర్త గ్రామాలలో రాష్ట్ర ప్రభుత్వం నిరుపేదలకు ప్రవేశ పెడుతున్న సంక్షేమ పథకాలు ప్రజలలోకి తీసుకెళ్లాల చూడాలన్నారు అనంతరం నూతన గ్రామ కమిటీలను ఎన్నుకున్నారు. కాట్రపల్లి గ్రామ శాఖ అధ్యక్షులు వాంకుడోత్ జగన్ ఉపాధ్యక్షుడిగా ఆరే కమలాకర్ గా ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ మండల నాయకులు బాసని చంద్ర ప్రకాష్, చల్లా చక్రపాణి, అబు ప్రకాష్ రెడ్డి, మారేపల్లి రవీందర్, దుబాసి కృష్ణమూర్తి రఘు సింగ్ తదితరులు పాల్గొన్నారు.



## మల్లక్కపేట హుండీ ఆదాయం లెక్కింపు



అక్షర దర్బార్, పరకాల : పరకాల మండలంలోని మల్లక్కపేట అభయాంజనేయ స్వామి ఆలయ హుండీని శుక్రవారం ఆలయ ఈవో వెంకటయ్య ఆధ్వర్యంలో లెక్కించారు. ప్రతి ఏటా రెండుసార్లు ఆదాయ హుండీ లెక్కింపు జరుగుతుందని అన్నారు. కార్తీక పౌర్ణమి నుంచి హనుమాన్ జయంతి వరకు హుండీ ఆదాయం రూ.82,355 వచ్చినట్లు తెలిపారు. ఈ లెక్కింపులో ఆలయ చైర్మన్ అంభీరు మహేందర్, ఇన్ స్పెక్టర్, ధర్మకర్త మండలి దావూ జ్యోతి, బిళ్ళ రాజిరెడ్డి, రాజిరెడి, బాలరాజు, దొమ్మటి శంకరయ్య, ఆలయ అర్చకులు తదితరులు పాల్గొన్నారు.



# ఆకేరు వాగు చెక్ డ్యాంకు మరమ్మతులు చేసేదెప్పుడో..?

### వానాకాలం సమీపిస్తున్న నిద్రమత్తు నుండి మేల్కొని అధికారులు

### ఆయకట్టు సాగుకు నీటి కష్టాలు తప్పవని రైతుల ఆందోళన



అక్షర దర్బార్, తొర్రూరు : గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో తొర్రూరు మండలంలోని సోమారపు కుంట తండా, నెల్లికుదురు మండలంలోని రామన్నగూడెం గ్రామాల మధ్య ఉన్నటువంటి ఆకేరు వాగుపై 2021 సంవత్సరంలో సుమారు రూ.7కోట్లతో నిర్మించిన చెక్ డ్యాం 2022 జూన్, జూలై మాసంలో కురిసిన అకాల వర్షాలతో చెక్ డ్యాం విరిగిపోయింది. దీంతో ప్రభుత్వ ఖజానాకు గండి పడింది. రైతుల ఆశలు ఆవిరయ్యాయి. ఈ రెండు గ్రామాల రైతులు, ప్రజాప్రతినిధులు, అధికారుల చుట్టూ తిరిగినా కూడా ఎవరు పట్టించుకోలేదు. ఈ క్రమంలో ఎన్నికలు రాగా కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా చెక్ డ్యాం మరమ్మత్తులు చేస్తారని ఆశలు పెట్టుకున్నారు. కానీ రెండు సంవత్సరాలు మరమ్మత్తులు నోచుకోకపోగా ప్రభుత్వ నిధులు రూ.ఏడు కోట్లు నీళ్ల పాలైంది. గత రబీ సీజన్లో చెక్ డ్యాం కింద నాట్లు వేసుకున్న రైతులు నీళ్ళు లేక పంటలు ఎండిపోయాయి. అదే చెక్ డ్యాం ఉంటే రైతులకు సమృద్ధిగా నీళ్లు ఉండి ఏ ఇబ్బందులు లేకుండా పంటలు పండించుకునేవారు. చెక్ డ్యాం మరమ్మత్తులు చేపట్టాలని రైతులు నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యేలు మామిడాల యశస్విని రెడ్డి, డాక్టర్ భూక్యా మురళి నాయక్ లకు వినతిపత్రాలు అందించారు. అయినా రెండు సంవత్సరాలుగా మరమ్మత్తులు చేయకపోవడంతో నిరుపయోగంగా మారింది. ఈసారి ముందుగానే నైరుతి రుతుపవనాలు ప్రవేశిస్తాయని వాతావరణశాఖ చెబుతుండటం, ఈనెలాఖరుకు రాష్ట్రంలో వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఇది తీపికబురు అయినప్పటికీ జిల్లాలో గతేడాది అంతకుముందు ఏడాదిలో కురిసిన భారీ వర్షాల వరదలకు దెబ్బతిన్న చిన్నపాటి వాగుల్లోని చెక్ డ్యాంలకు మరమ్మత్తులు కరువయ్యాయి. ఈ ఏడాది కూడా వనరుల్లో నీటి నిల్వలు ఆశించిన మేర ఉండని పరిస్థితులు తలెత్తుతున్నాయని, ఆయకట్టుకు సాగు నీటి కష్టాలు తప్పవని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

### చెక్ డ్యాంకు మరమ్మత్తులు చేపట్టాలి

**రెడ్యా నాయక్, రైతు సోమారపుకుంట తండా**



గతంలో కురిసిన భారీ వర్షాల వరదలకు ఆకేరు వాగులోని చెక్ డ్యాం సైడ్ రివిట్ మెంట్ మట్టి కొట్టుకుపోయి నీళ్లన్నీ వృధాగా పోయాయి. సుమారు 300 ఎకరాల ఆయకట్టుకు నీళ్లు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. బావులు, బోర్లలో నీళ్లు అడుగంటి పోయాయి. వానాకాలం ముందే శాశ్వత మరమ్మత్తులు చేయించాలి. గతంలో ఎమ్మెల్యే యశస్విని రెడ్డి దృష్టికి తీసుకెళ్లడం జరిగింది. అధికారులు త్వరగా మరమత్తులు చేపట్టాలి.

### చెక్ డ్యాంను రైతులకు అందుబాటులోకి తీసుకొస్తాం

**గంటి శ్రీకాంత్, ఇరిగేషన్ డీఈ**

గతంలో కురిసిన అకాల వర్షాలకు చెక్ డ్యాం విరిగిపోయింది. దాని మరమ్మత్తులు చేపట్టాలని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించాం. ప్రభుత్వం నుండి అనుమతులు రాగానే విరిగిన చెక్ డ్యాంకు కాంట్రాక్టర్ మరమ్మతులు చేపడతారు. చెక్ డ్యాం పక్కకు ఉన్నటువంటి రివిట్ మెంట్ కట్ట అనుమతులు రాగానే కొట్టుకుపోయిన మట్టిని పోయిస్తాం.

### పది గుంటల భూమికి నష్టపరిహారం చెల్లించాలి

**కొంతం వెంకటేశ్వర్లు, రైతు రామన్నగూడెం**

ఆకేరు వాగుపై చెక్ డ్యాం నిర్మించేటప్పుడు సైడ్ కట్ట సరిగ్గా పోయకపోవడంతో 2022 జూలైలో కురిసిన భారీ వర్షాలకు డ్యాం విరిగి పక్కకు ఉన్న నా సొంత భూమి పొలంలో పడిపోవడంతో భారీ కోతకు గురై 10 గుంటల భూమిని నష్టపోయానని అధికారులకు, ప్రజాప్రతినిధులకు విన్నవించుకున్నా ఎవరు స్పందించలేదు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చెక్ డ్యాం మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తీసుకురావాలి. నా పది గుంటల భూమికి నష్టపరిహారం అందించాలి.



# మాతృత్వం ఒక వరం

- జిల్లా కలెక్టర్ ప్రావీణ్య
- బాల సదనం నుంచి ఓ బాలిక అమెరికాకు దత్తత

అక్షరదర్బార్, హనుమకొండ: చట్టబద్ధమైన దత్తత ప్రక్రియ శుక్రవారం జిల్లా కలెక్టర్ పి ప్రావిణ్య ఆధ్వర్యంలో జరిగింది. సంబంధిత వివరాలు ఈ విధంగా ఉన్నాయి. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ అనుబంధ శిశు గృహ, బాల సదనంలో ఆశ్రయం పొందుతున్న బాలిక (10) వివరాలను కేంద్ర దత్తత వనరుల విభాగంకు ఆన్లైన్ చేయగా అమెరిక దేశానికి చెందిన దంపతులు అంతర్ రాష్ట్ర దత్తత కోసం దరఖాస్తు చేసుకున్నారు. దరఖాస్తును పరిశీలించిన కేంద్ర దత్తత వనరుల విభాగం సీనియారిటీ ప్రకారం గతంలో శిశు గృహ, బాలసదనంలో రక్షణ సంరక్షణ పొంది నిబంధనల మేరకు జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో ఇంటర్ కంట్రీ ఆడాప్షన్ అందించడం జరిగింది. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మాతృత్వం ఒక వరమని, అందుకు చట్ట బద్ధమైన దత్తత ప్రధాన మార్గమని, పిల్లలు లేని దంపతులు చట్ట బద్ధమైన దత్తతను తీసుకోవాలని అన్నారు. జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి మాట్లాడుతూ ఇప్పటి వరకు 10 మంది పిల్లలను ఇంటర్ కంట్రీ అడాప్షన్ లో భాగంగా ఇటలీ, మాల్టా, లండన్, అమెరిక దేశాలకు దత్తత ఇచ్చామని అన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి జె జయంతి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యుడు సందసాని రాజేంద్ర ప్రసాద్, బాల రక్షా భవన్ కో ఆర్డినేటర్ సీహెచ్ అవంతి, బాల సదనం సూపరింటెండెంట్ ఎం కళ్యాణి, జిల్లా బాలల పరిరక్షణ ఇన్చార్జి అధికారి ఎస్ ప్రవీణ్ కుమార్, ప్రొటెక్షన్ ఆఫీసర్ ఎం మౌనిక, దత్తత కేంద్రం సోషల్ వర్కర్ సంగి చైతన్య తదితరులు పాల్గొన్నారు.



### తక్కువ యూరియా వాడండి. సాగు ఖర్చును తగ్గించండి

అక్షర దర్బార్, పరకాల : నడికూడ మండల రైతు వేదికలో వ్యవసాయ శాస్త్రవేత్తలు డా. మధు, డా. హరిల ఆధ్వర్యంలో శుక్రవారం రోజు "రైతు ముంగిట్లో శాస్త్ర వేత్తలు"అనే కార్యక్రమంలో రైతులను ఉద్దేశించి 6 అంశాలపై మాట్లాడారు. వాటిలో తక్కువ యూరియా వాడండి సాగు ఖర్చును తగ్గించండి. అవసరం మేరకు రసాయనాలను వినియోగించండి. నేలతల్లి ఆరోగ్యాన్ని కాపాడండి.రసీదులను భద్రపరచండి కష్టకాలంలో నష్టపరిహారాన్ని పొందండి. సాగు నీటిని ఆదా చేయండి భావితరాలకు అందించండి. పంట మార్పిడి పాటించండి సుస్థిర ఆదాయాన్ని పొందండి. చెట్లను పెంచండి పర్యావరణాన్ని కాపాడండి అని రైతులను కోరారు.

## తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి కొనుగోలు చేయండి


### వరంగల్ జిల్లా కలెక్టర్ ను ఆదేశించిన సివిల్ సప్లై కమిషనర్



నర్సంపేట అక్షర దర్బార్, నర్సంపేట,ఎమ్మెల్యే దొంతి మాధవ రెడ్డి అభ్యర్థన మేరకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆదేశాలతో కొనుగోలు చేయాలని సివిల్ సప్లై అధికారులు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. నర్సంపేట నియోజకవర్గంలో గత నాలుగైదు రోజులుగా కురిసిన వర్షానికి 4 వేల మెట్రిక్ టన్నుల ధాన్యం తడిసిందని, తడిసిన ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి ప్రభుత్వం కొనుగోలు చేయాలని నర్సంపేట ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పౌరసరఫరాలు శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డిని కలిసి విన్నవించగా వెంటనే సానుకూలంగా స్పందించిన మంత్రి వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని సివిల్ సప్లై కమిషనర్ని ఆదేశించడంతో నర్సంపేట తో పాటు వరంగల్ జిల్లాలో తడిసిన 6 వేల మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని బాయిల్డ్ రైస్ గా పరిగణించి కొనుగోలు చేయాలని జిల్లా కలెక్టర్ కి ఆదేశాలు జారీ చేశారు. దీంతో వెంటనే తడిసిన ధాన్యం కొనుగోలు ప్రక్రియ వేగవంతమైంది.

# కరోనా కలకలం

### హైదరాబాద్ లో కోవిడ్ కేసు



అక్షరదర్బార్, హైదరాబాద్: రాష్ట్రంలో మళ్లీ కరోనా కలకలం రేపుతుంది. హైదరాబాద్ లో కూకట్ పల్లిలోని ఓ డాక్టర్ కు కోవిడ్ పాజిటివ్ గా నిర్ధారణ అయింది. గత రెండు రోజుల నుంచి ఫీవర్ తో బాధపడుతున్న సదరు వైద్యుడికి ఆర్టీపీసీఆర్ టెస్ట్ చేయగా పాజిటివ్ వచ్చిందని వైద్య అధికారులు వెల్లడించారు. ప్రస్తుతం ఆయన్ను క్వారంటైన్ లో ఉంచినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తాజాగా వైద్య ఆరోగ్యశాఖ ఉత్తర్వులు జారీ చేసింది.

# ఎన్ కౌంటర్

### నలుగురు మావోయిస్టుల మృతి

అక్షరదర్బార్, గడ్చిరోలి: మహారాష్ట్రలోని గడ్చిరోలి జిల్లాలో శుక్రవారం ఎన్ కౌంటర్ జరిగింది. భద్రతా దళాలు, మావోయిస్టుల మధ్య జరిగిన కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. ఛత్తీస్ గడ్, మహారాష్ట్ర సరిహద్దుల్లో జరిగిన ఈ ఎన్ కౌంటర్ లో మరణించిన మావోయిస్టుల్లో ఇద్దరు మహిళలు ఉన్నట్లు తెలిసింది. ఘటన స్థలంలో ఒక ఆటోమేటిక్ సెల్ఫ్ లోడింగ్ రైఫిల్, రెండు 303 రైఫిల్స్, ఒక భార్మర్, వాకీటాకీలు, క్యాపింగ్ మెటీరియల్ ను భద్రతా దళాలు స్వాధీనం చేసుకున్నట్లు సమాచారం. ఉదయం జరిగిన ఎదురు కాల్పుల్లో నలుగురు మావోయిస్టులు చనిపోయారని గడ్చిరోలి పోలీసులు తెలిపారు.

